తగ్గిన లక్ష్యం.. మించిన సమయం

మధ్యమానేరులో చేప పిల్లలు వదిలేందుకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, బోయినపల్లి

జలాశయాలు, చెరువుల్లో వదలాల్సిన చేప పిల్లల లక్ష్యాన్ని ఈ ఏడాది కుదించారు. టెండర్ ప్రక్రియలో జాప్యం, సీజన్ ముగుస్తుండటం వంటి అంశాలే ఇందుకు కారణం. గుత్తేదారు ముందుకు రావడంతో త్వరలో మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్‌లో చేప పిల్లలు వదలనున్నారు. మత్స్యశాఖ అధికారులు ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మత్స్యకారులకు స్థానికంగా ఉన్న చెరువులు, జలాశయాల్లో జీవనోపాధి కల్పించాలని చేప, రొయ్య పిల్లలను ఏటా ప్రభుత్వం వదులుతుంది. జిల్లాలోని మధ్యమానేరు, ఎగువ మానేరు, అన్నపూర్ణ జలాశయాలతోపాటు చెరువులు, కుంటల్లో చేప పిల్లలను ఏటా వేస్తున్నారు. జలాశయాల్లో రొయ్య పిల్లలను కూడా వదులుతున్నారు.

- జిల్లాలో సుమారు 116 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 8 వేల మంది పైగా సభ్యులున్నారు.
- చెరువుల్లో 35-40 ఎంఎం, జలాశయాల్లో 80-100 ఎంఎం బరువు ఉన్న రాహు, బంగారు తీగ, బొచ్చె రకాలకు చెందిన నెల రోజుల వయసున్న చేప పిల్లలను విడిచిపెడుతున్నారు.
- ఇవి బాగా పెరిగిన తరవాత మత్స్యకారుల వేట సమయంలో కిలో, ఆపైన బరువు ఉన్న చేపలు లభిస్తున్నాయి.
- మత్స్యకారులతోపాటు చేపల విక్రయాలతో వందల మందికి ఉపాధి కలుగుతుంది.



మధ్యమానేరు జలాశయం

- కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడకు చెందిన వ్యాపారులు జలాశయాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండగా, హైదరాబాద్‌కు చేపలను పలువురు ఎగుమతి చేస్తున్నారు.

అందుబాటులో లేక...

మూడు జలాశయాలతోపాటు 430 చెరువుల్లో చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. అయితే టెండర్ ప్రక్రియలో జాప్యం, సీడ్‌ఫాంలలో సరిపడా పిల్లలు లేకపోవడంతో ప్రస్తుత సంవత్సరంలో లక్ష్యాన్ని 71 లక్షలకు కుదించారు.

- గత ఏడాదితో పోలిస్తే 69 లక్షలు తక్కువగా వదులుతున్నారు.

రొయ్యపై స్పష్టత లేక...

మధ్యమానేరు, అన్నపూర్ణ, ఎగువమానేరు జలాశయాల్లో చేప పిల్లలతోపాటు రొయ్య పిల్లలను ఏటా వదులుతున్నారు. అయితే చేప పిల్లల విడుదలకు ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో టెండర్, ఇతర ప్రక్రియ పూర్తి కావడంతో విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా రొయ్య పిల్లల విడుదలపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. సీజన్ ముగుస్తుండటంతో ఈ సంవత్సరంలో రొయ్య పిల్లల పంపిణీ లేనట్లే. దీంతో ఈ ఏడాది మూడు జలాశయాల పరిధిలో రొయ్యలు కనిపించవు.

పంపిణీకి చర్యలు




జిల్లాలో 430 చెరువులు, జలాశయాల్లో మొదటగా 1.40 లక్షల చేప పిల్లలు వదలాలని నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం 71 లక్షల చేప పిల్లలు వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. రొయ్య పిల్లల పంపిణీపై స్పష్టత లేదు. ఈ ఏడాది రొయ్యల విడుదల సాధ్యం కాకపోవచ్చు.

- వరదారెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా మత్స్యశాఖ అధికారి

కిడ్నీ బాధితులకు ఊరట కలిగేనా!

- రాష్ట్రంలో కొత్తగా శస్త్రచికిత్స కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు ఎదురుచూపులు





పెద్దపల్లి జిల్లాసుపత్రి డయాలసిస్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే గోదావరిఖని పట్టణం

కిడ్నీ రోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రక్తనాళాల శస్త్రచికిత్స(వాస్క్యులర్ సర్జరీ), డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 ప్రభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఉండగా.. 150 పడకల వరకు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 11,250 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా ప్రత్యేక వాస్క్యులర్ సర్జన్లు లేరు. నెఫ్రాలజిస్టు స్పెషలిస్టులు సైతం అందుబాటులో లేరు. కేవలం రోగులకు డయాలసిస్ యంత్రాల ద్వారా రక్తశుద్ధీకరణ మాత్రమే జరుగుతోందని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలు-రోగుల వివరాలు

జిల్లా	ఆసుపత్రులు	పడకలు	రోగుల సంఖ్య
కరీంనగర్	4	45	5,210
పెద్దపల్లి	3	15	2,120
జగిత్యాల	3	50	2,450
సిరిసిల్ల	2	40	1,470

గాంధీ, నిమ్స్‌కు వెళ్లాల్సిందే..

కిడ్నీ బాధితులకు తొలిసారి రక్తశుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు డయాలసిస్ యాక్సెస్ పాయింట్ ఏర్పాటుకు వాస్క్యులర్ సర్జరీ అవసరమవుతుంది. శరీరంలోని రక్తాన్ని 4 గంటలపాటు అన్ని అవయవాలకు ప్రవహించేలా ఈ శస్త్రచికిత్స చేస్తారు. ఇలాంటి చికిత్సలు హైదరాబాద్‌లోని గాంధీ, నిమ్స్ ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు వ్యయ ప్రయాసలతో హైదరాబాద్‌కు వెళ్లి చేయించుకోవాల్సి వస్తుంది. చికిత్స అనంతరం ఆయా జిల్లాల్లోని డయాలసిస్ కేంద్రాల ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా రెండు రోజులకొకసారి 4 గంటలపాటు రక్తం శుద్ధి చేసుకుంటున్నారు.

రక్త శుద్ధీకరణ ఇలా..



✦ మధుమేహం, మద్యపానం, జన్యుపరమైన లోపాల మూలంగా మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. రక్తశుద్ధీకరణ సాఫీగా జరగకపోవడంతో ప్రాణాప్రాయ పరిస్థితులకు రోగి చేరుకునే అవకాశం ఉంటుంది. దీంతో వెంటనే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. గుండెకు తీసుకెళ్లే, తీసుకొచ్చే రక్తనాళాల మార్గాన్ని కలుపుతూ శస్త్రచికిత్స చేసి.. రక్తం శుద్ధిచేసే పైపులకు అనుసంధానం చేస్తారు. తద్వారా రోగి రెండు రోజులకొకసారి డయాలసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. హృదయ స్పందన సజావుగా సాగేందుకు.. ధమనులు, సిరలకు రక్త శుద్ధీకరణ సాఫీగా జరిగేందుకు యంత్రాల ద్వారా పర్యవేక్షణ చేస్తారు.

✦ కిడ్నీలకు వెళ్లే రక్తనాళాలకు సమస్యలుంటే మోచేయి కింద మణికట్టుకుపైన శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏ ప్రభుత్వాసుపత్రులోనూ ప్రత్యేకంగా వాస్క్యులరీ సర్జన్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

✦ ఎండో వాస్క్యులరీ సిస్టం వంటి అత్యాధునిక రక్తనాళాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ సేవలు రోగులకు అందడం లేదు. ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు(నెఫ్రాలజిస్టులు) కూడా అందుబాటులో లేరు. అన్ని డయాలసిస్ కేంద్రాల్లోనూ కేవలం యంత్రాల టెక్నీషియన్లు, నర్సులు, ఇతర సిబ్బంది తప్ప వైద్య చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా కిడ్నీ వైద్య నిపుణులు అందుబాటులో లేరు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సత్యనారాయణగౌడ్

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నాగుల సత్యనారాయణగౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ సీనియర్ నాయకుడిగా, డీసీసీ అధ్యక్షుడిగా చాలా కాలం సేవలందించిన ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి వరించింది. సిరిసిల్లకు చెందిన ఆయన బీఏ పూర్తి చేశారు. 1970 నుంచి 1972 వరకు సిరిసిల్ల జూనియర్ కళాశాలలో విద్యార్థి నాయకుడిగా పని చేశారు. 1975లో యూత్ కాంగ్రెస్‌లో చేరారు. 1977 నుంచి 1978 వరకు బ్లాక్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. 1978-1982 వరకు వ్యవసాయ అభివృద్ధి బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నారు. 1995 నుంచి 2000 వరకు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగారు. 2006లో సెస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ ఏర్పడిన తరవాత పీసీసీలో కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులుగా పని చేశారు. 2014 నుంచి 2023 వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగారు. 56 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన తనను గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు.



బురదమయం.. వైకుంఠధామ మార్గం



రుద్రంగి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వెనుక ఉన్న వైకుంఠధామానికి వెళ్లే దారిలో ఎగువ నుంచి వచ్చే ఊట నీరు చేరటంతో దారంతా బురదమయంగా మారుతోంది. దీంతో అంతిమయాత్రకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లే మార్గం కూడా ఇలాగే ఉంది. అధికారులు స్పందించి ఎగువ నుంచి వచ్చే ఊట నీటితో ఏర్పడే ఇబ్బందులను తొలగించేందుకు ఇక్కడ కల్వర్టును నిర్మించాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంగి**

పట్టాలు పునరుద్ధరించాలని మంత్రికి వినతి

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: మండలంలోని అనంతారంలోని 601 సర్వే నంబరులోని రైతులకు పట్టాలు పునరుద్ధరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసిన వినతిపత్రం అందించారు. ఇందిరాగాంధీ హయాంలో 75 కుటుంబాలకు భూమి ఇవ్వగా రైతులు సాగుచేసుకుంటున్నారని, భారాస ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో ఎక్కించకపోవడంతో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు రాలేదని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లు ఆపండి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: బంధన్ బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ కంపెనీలలో రుణాలు పొందిన వారి నుంచి బలవంతపు వసూళ్లు నిలిపి వేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన ఐద్వా మూడో జిల్లా మహా సభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పేదల నుంచి బలవంతపు వసూళ్లు చేస్తున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేట్ బ్యాంకుల్లో పేదలు తీసుకున్న రుణాలను రద్దు చేయాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. గొలుసు దుకాణాలను మూసివేయాలన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా సూరం పద్మ, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి విమల, సహాయ కార్యదర్శులుగా సామల కవిత, వడ్ల లక్ష్మి, బోనాల లక్ష్మిలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నంది గరుత్మంతుడి వాహనంపై విహరించిన స్వామివార్లు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివార్లు పెద్ద సేవ నంది గరుత్మంతుడు వాహనంపై ఊరేగారు. నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారు కుష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన పెద్ద సేవపై ప్రతిష్ఠించి అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో వాహనంపై స్వామివార్లను ఊరేగిస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని రాజన్న ఆలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని మహిళలు, యువతులు ఆలయానికి చేరుకుని బతుకమ్మ ఆడి పాడారు. అనంతరం ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే, వేములవాడ



నేతన్నల కల.. నెరవేరిన వేళ

నూలు డిపో ఏర్పాటుపై సర్వత్రా హర్షం

న్యూస్‌టుడే, తంగళ్లపల్లి

జిల్లాలో నూలు డిపో ఏర్పాటుతో సిరిసిల్లలో ఉన్న పవర్‌లూమ్ పరిశ్రమకు కొంత మేరకు ఊరట లభించనున్నది. పెట్టుబడి భారం తగ్గి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో దోహదపడనుంది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో ఉన్న నేతన్నలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏడాదికి రెండు చొప్పున మొత్తం 1.3 కోట్ల చీరలు మహిళా సంఘాల సభ్యులకు ఇస్తామని ప్రకటించింది. ఈనేపథ్యంలో సిరిసిల్ల నేతన్నలపై ఆర్థిక భారం తగ్గించాలన్న ఆలోచనతో రూ.50 కోట్లతో వేములవాడలో నూలు డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- సిరిసిల్లలో గతంలో నూలు డిపో లేకపోవడం వల్ల సిరిసిల్లలో ఉన్న సుమారు 500 మంది యజమానులు గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్, ముంబయి ఏజెంట్ల ద్వారా కమీషన్ మీద సిరిసిల్లకు సరఫరా చేస్తున్నారు. ఈ నూలును సిరిసిల్లలో ఉన్న యజమానులు ఆసాములకు ఎక్కువ ధరకు అందజేసి, వారు తయారు చేసిన వస్త్రాన్ని సేకరించేవారు.



- ప్రస్తుతం జిల్లాలోని వేములవాడలో ఏర్పాటు చేస్తుండటం వల్ల జిల్లాలో ఉన్న 2000 మంది పైగా ఆసాములకు ఆర్థిక భారం తగ్గనుంది.
- డిపో ఏర్పాటు చేయడం వల్ల రెండు సాంచాలు ఉన్న కార్మికుడు కూడా నేరుగా అక్కడికి వెళ్లి ముడిసరకు కొనుగోలు చేసి స్వతహాగా పరిశ్రమను నడిపించుకునే అవకాశం ఏర్పడుతుంది. దీని వల్ల ప్రతి నేత కార్మికుడికి లబ్ధి చేకూరుతుంది. సొంతంగా పరిశ్రమలను నడిపించుకోవడానికి ఇది ఎంతగానో దోహదపడనుంది.

సంతోషకరం



జిల్లాలో నూలు డిపో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం. దీని ద్వారా చిన్న తరగతి వారు కూడా సొంతంగా పరిశ్రమలను నడిపించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇంకా విధి విధానాలు ప్రకటించలేదు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేయడం హర్షణీయం.

- అన్నల్‌దాస్ అనిల్, టెక్స్‌టైల్ పార్క్ వస్త్ర పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు

పెట్టుబడి భారం తగ్గుతుంది



నూలు డిపో ఏర్పాటు చేయడం వల్ల ఆసామి అనే వ్యక్తి యజమాని దగ్గరకు పోకుండా అతనే సొంతంగా ముడిసరకు కొనుగోలు చేసి పరిశ్రమను నడిపించుకునే అవకాశం ఉంటుంది. తద్వారా పెట్టుబడి భారం తగ్గి ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చు. ప్రభుత్వం నూలు డిపో ఏర్పాటు చేయడం శుభపరిణామం.

- తాటిపాముల దామోదర్, సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు

నేరెల్లలో ఇస్కాన్ మందిరం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ, భారాస నాయకులు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం నేరెల్ల గ్రామంలో ఇస్కాన్ మందిరం నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యుడు కేకే మహేందర్‌రెడ్డిలు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో సువిశాలమైన స్థలంలో నూతన మందిరాన్ని నిర్మిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, భారాస నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగేదెన్నడో?

న్యూస్‌టుడే, వీర్నపల్లి

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రహదారులు మంజూరు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఐదేళ్ల క్రితం ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడువు సమీపిస్తున్నా పనులపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వీర్నపల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణతోపాటు 25 కిలోమీటర్ల బీటీ రోడ్డు, వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 50 కోట్లు మంజూరు చేసింది. బీటీ రోడ్డు పనులు సుమారు ఐదేళ్ల క్రితం పూర్తయ్యాయి. గర్జనపల్లిలో ఇటీవల సీసీ రోడ్డు పూర్తికాగా, వీర్నపల్లిలో నాలుగు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. 52 అడుగుల మేర విస్తరించేందుకు గ్రామసభ తీర్మానం చేసింది.



రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభం

- మండల కేంద్రంలో సుమారు ఒక కిలోమీటరు మేర రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లు తొలగించారు. మరో ఆరు వందల మీటర్ల పరిధిలో ఇళ్లను తొలగించాల్సి ఉంది.
- నవంబరు వరకు గడువు ఉన్నా పనుల పూర్తిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరిహారంపై ఆశలు...

వీర్నపల్లిలో 1.6 కిలోమీటర్ల మేర విస్తరణ పనుల్లో భాగంగా 80 మంది పైగా యజమానులు ఇళ్లను కోల్పోతున్నారు.

- గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అంబేడ్కర్‌నగర్‌లో 40 మంది పైగా స్వచ్ఛందంగా తొలగించి కొత్తగా నిర్మాణాలు చేసుకొన్నారు.
- రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు మధ్యలో చేతులెత్తేయడంలో వారికి బిల్లులు రాలేదు.
- సుభాష్‌నగర్, హనుమాన్‌నగర్‌లో ఆరు వందల మీటర్ల వరకు ప్రస్తుతం 30 పైగా ఇళ్లను తొలగించాల్సి ఉంది. తొలగిస్తే మళ్లీ కట్టుకునే స్తోమత వారికి లేదు. ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే వరకు పాత ఇంటిని తొలగించేది లేదని యజమానులు స్పష్టం చేశారు.
- రహదారి విస్తరణకు ముందే కరెంటు స్తంభాలు తొలగించాల్సి ఉండగా అంచనాలు తయారీ చేసి సెస్‌కు అందించారు. ఇందుకోసం రూ. 43 లక్షలు ఖర్చవుతుండగా టోకెన్ ఇచ్చారు. అసలే నష్టాల్లో ఉన్న సెస్ టోకెన్‌పై ఆధారపడి స్తంభాలు చేసేందుకు ముందుకు రావడం లేదు.
- సీసీ రోడ్డుకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. వంతెనల వద్ద అప్రోచ్ రోడ్లు కోతకు గురవుతున్నాయి. రిటర్నింగ్ వాల్ లేకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి.
- నాలుగేళ్ల క్రితం పూర్తయిన బీటీ రోడ్డు చాలా చోట్ల ధ్వంసమైంది. రోడ్డు అంచులు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి.



రోడ్డుపై మురుగు

- రహదారి ఎత్తు పెరగడంతో లింకు రోడ్ల ద్వారా కాలనీలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు.

చర్యలు తీసుకుంటాం



రహదారి విస్తరణ పనులు నవంబర్ లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ధ్వంసమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం. వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు, రక్షణ గోడ నిర్మిస్తాం. విద్యుత్తు స్తంభాల తొలగింపు, ఇరువైపులా స్తంభాల ఏర్పాటుకు రూ. 43 లక్షలతో అంచనాలు రూపొందించాం. దీనికి సంబంధించిన టోకెన్‌ను సెస్‌కు ఇచ్చాం. పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

- కిరణ్, ఆర్అండ్‌బీ ఏఈ

లక్ష్యం.. ప్రణాళిక.. సాధన..

◆ డీఎస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్ల మనోగతం

విజేతల గెలుపు సూత్రాలివి

'విజేతలు భిన్నమైన పనులు చేయరు.. అందరూ చేసే పనులనే వైవిధ్యంగా చేస్తారు..' అని అంటారు ప్రముఖ ఆంగ్ల రచయిత శివ్‌ఖేరా. అందరికీ ఉన్న సమయమే తమకూ ఉన్నా కొందరు దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేలల్లో ఒకడిగా కాకుండా, అందరిలోనూ ప్రథముడిగా నిలవాలన్న లక్ష్యంతో ఎంచుకున్న రంగంలో మేటిగా నిలుస్తున్నారు.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

వారంతా లక్ష్యం నిర్దేశించుకొన్నారు. సాధన కోసం కఠోరంగా శ్రమించారు. పాఠ్య పుస్తకాలనే నేస్తాలుగా మలచుకున్నారు. అపజయాలనే పాఠాలుగా చేసుకున్నారు. ప్రణాళిక, లక్ష్యం, పునశ్చరణ, స్వీయ మూల్యాంకనం.. ఇవే తమ గెలుపు సూత్రాలని చెబుతున్నారు. ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులు తమ సన్నద్ధత తీరును 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



ప్రతి పాఠానికీ స్వీయ పరీక్ష



ఉన్నది ఒకే పోస్టు, ప్రతి రోజూ రేపే ఫైనల్ పరీక్ష ఉన్నట్లు భావించా. ఉద్యోగానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి ఎలాగైనా సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఏరోజూ సమయాన్ని వృథా చేయలేదు. అవసరమైన ప్రణాళిక వేసుకొని సన్నద్ధమయ్యా. ఒక్కో రోజు రెండు, మూడు గంటలే నిద్రపోయాను. ఆన్‌లైన్‌లో పాఠాలు విన్నా. ప్రతి పాఠానికి స్వీయ పరీక్ష పెట్టుకొని తప్పులు లేకుండా సాధన చేశా. సబ్జెక్టుకు సంబంధించిన అంశాలపై మిత్రులతో చర్చించా. క్వశ్చన్ బ్యాంకు జోలికి వెళ్లలేదు. సాధన, పునశ్చరణతోనే మంచి ఫలితం వస్తుందని నమ్మాను. రెండు నెలల కిందట గురుకులంలో పీజీటీగా విధుల్లో చేరా. భర్త శ్రీనివాస్ సహకారంతోనే రెండు కొలువులు సాధించగలిగా.

– సుభద్ర, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, భద్రిపల్లి, అంతర్గాం మండలం

ఓటమి నేర్పిన విషయాలెన్నో..



ఓటమి నా జీవితాన్ని మలుపు తిప్పింది. గతంలో ఒకసారి డీఎస్సీ, మూడు సార్లు గురుకుల ఉపాధ్యాయ పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. అయినా నిరాశ చెందలేదు. మానసిక ఒత్తిడికి గురి కాలేదు. ఈసారి రోజుకు 10 గంటల పాటు సన్నద్ధమయ్యా. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదివా. అందులోని సాహిత్యంపై పట్టు పెంచుకున్నా. ప్రతి పాఠానికీ నోట్స్ సిద్ధం చేసుకొని కఠినమైన అంశాలను గుర్తుంచుకునేలా సాధన చేశా. అర్థం కాని విషయాలపై ఆన్‌లైన్‌లో శోధించి సందేహాలు నివృత్తి చేసుకున్నా. సైకాలజీ, మెథడాలజీని అర్థం చేసుకున్నా. కవులు, సాహితీవేత్తలకే పరిమితం కాకుండా కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జిపై దృష్టి పెంచాలి.

– కృష్ణ వేముల, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, గోదావరిఖని

అర మార్కు మలుపు తిప్పింది



గత డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం దూరమవడం నా జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. వచ్చేసారి ఎలాగైనా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. పొరపాట్లు సరిదిద్దుకున్నా. పట్టుదలతో సన్నద్ధమయ్యా. పగలు మొత్తం జిల్లా గ్రంథాలయంలోనే గడిపా. కీలక అంశాలు, సమాచారంపై స్నేహితులతో కూలంకుశంగా చర్చించా. ప్రతి అంశాన్ని రాసుకున్నా. పోటీ పరీక్ష అంటే మొదట భయం వీడాలి. ఇన్నాళ్లూ చదివిన అంశాలపై తడబడకుండా పరీక్ష రాయాలి. కుటుంబ సభ్యుల సహకారంతో కొలువు సాధించా.

– నీరటి శ్రీనివాస్, ఎస్జీటీ, కదంబాపూర్, సుల్తానాబాద్ మండలం

మూడు సార్లు స్వల్ప మార్కులతో దూరం



గతంలో మూడు సార్లు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరైనా స్వల్ప మార్కులతో ఉద్యోగాలు కోల్పోయా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రతతో సన్నద్ధమయ్యా. రోజుకు 6 గంటల పాటు కఠిన సాధన చేశా. గ్రంథాలయానికి వెళ్లి సిద్ధమయ్యా. 6 నుంచి 12వ తరగతి వరకు పుస్తకాల్లోని ప్రతి అంశాన్నీ రాసుకున్నా. వివిధ పబ్లికేషన్లకు సంబంధించిన పుస్తకాలు చదివా. రేఖాగణితం, క్షేత్రమితి, సంఖ్యామానం, త్రికోణమితిలపై పట్టు పెంచుకునే భావనలను గుర్తుంచుకున్నా. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకున్నా.

– లట్ట శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ గణితం, గోపాల్‌పూర్, మంథని మండలం

ఒక్క పోస్టున్నా నాదే కావాలనుకున్నా

బయోసైన్స్‌లో ఒక్క పోస్టున్నా మొదటి ర్యాంకుతో అది నాదే కావాలి.. అని లక్ష్యంగా పెట్టుకొని చదివా. గతంలో ఒకసారి డీఎస్సీ రాసినా ఉద్యోగం రాకపోవడంతో కొంత నిరాశకు గురయ్యా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని క్రమశిక్షణ, ప్రణాళికతో సన్నద్ధమయ్యా. పట్టు వదలకుండా రోజుకు 12 గంటల పాటు శ్రమించా. కంటెంట్, మెథడాలజీ, విద్యా దృక్పథాలు, సైకాలజీపై ఎక్కువగా దృష్టి పెట్టా. 6 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో లైన్ టు లైన్ చదువుతూ నోట్స్ రాసుకున్నా. ప్రతి పాఠానికి సొంతంగా పరీక్ష పెట్టుకొని తప్పులు దిద్దుకున్నా. భర్త మునీంద్ర, మా అమ్మ రీనాకుమారి ప్రోత్సాహంతో లక్ష్యం సాధించా.

– గడదాస్ ప్రణీత, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, రామగుండం

పాఠ్యాంశాలను జీవితానికి అన్వయించుకున్నా



గతంలో రెండు సార్లు డీఎస్సీ రాసినా నిరాశే ఎదురైంది. అప్పుడు చేసిన పొరపాట్లను మననం చేసుకొని వాటినే సవాళ్లుగా తీసుకున్నా. ప్రయత్న లోపాలు తెలుసుకున్నా. క్రమశిక్షణగా రోజుకు 12 గంటల పాటు సన్నద్ధమయ్యా. పాఠ్య పుస్తకాలు, దినపత్రికల్లో వచ్చే సమాచారాన్ని క్రమం తప్పకుండా అనుసరించా. బట్టీ పట్టే విధానం కాకుండా పాఠ్యపుస్తకాల్లోని అంశాలను నిత్య జీవితానికి అన్వయించుకున్నా. సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానంలో కొంత సమాచారం అందుబాటులో ఉండదు. అందుకే పాత పుస్తకాల్లోని అంశాలను క్రోడీకరించి నోట్స్ సిద్ధం చేసుకున్నా. వీలైనన్ని ఎక్కువ సార్లు మననం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఫిజిక్స్ అనే ఫోబియాను మనసులో తొలగించుకొని సాధన చేస్తే మిగతా సబ్జెక్టుల కంటే ఇది చాలా సులువు.

– శీలం దేవేందర్, స్కూల్ అసిస్టెంట్, భౌతికశాస్త్రం, వెల్గపూర్, మంథని మండలం

సమస్యల వలయంలో శాతవాహన

శాశ్వత ఉపకులపతి లేక నిర్ణయాల్లో జాప్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆందోళన (పాతచిత్రం)

విశ్వవిద్యాలయాలు.. విద్యార్థుల మేధోశక్తికి పదును పెడుతూ వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రాంగణాలు.. విద్యార్థి శక్తిని దేశానికి ఉపయోగపడేలా చేయాల్సిన విద్యా కర్మాగారాలు.. అలాంటివి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం సమస్యలకు లోగిలిగా మారింది. మే 21న గత ఉపకులపతి పదవి ముగిసింది. ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఐఏఎస్ సురేంద్రమోహన్ నాలుగు నెలలుగా కొనసాగుతున్నారు.

విజిలెన్స్ విచారణ

విశ్వవిద్యాలయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తూ సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా.. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెండు నెలలుగా వర్సిటీలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. శాశ్వత ఉపకులపతిని నియమించాలని కోరుతూ, విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిపించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు దఫాలుగా ఆందోళనలు చేస్తూ.. ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు సమర్పిస్తున్నారు.

■ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేయటంలేదు. వందలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. పేరుకు మాత్రమే విశ్వవిద్యాలయంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

■ ఏటా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సంఖ్య పెంచటానికి ప్రయత్నం చేయాలి. కానీ వాటి జాడే లేదు.

■ పాలక మండలి(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)గా పిలిచే శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి పాలక మండలి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక, ఉన్నత, డిగ్రీ విద్య కమిషనర్లు, కార్యదర్శులతో పాటు ఎస్‌యూ వీసీ సభ్యుడిగా ఉండే తాత్కాలిక కార్యనిర్వాహక మండలి మాత్రమే కొనసాగుతోంది.

■ ఇన్‌ఛార్జి ఉపకులపతి నాలుగు నెలల కిందట వచ్చారంటే.. మళ్లీ ఇటీవల విశ్వవిద్యాలయానికి వచ్చారు. ప్రభుత్వ శాఖల పనుల నిర్వహణలో తీరిక లేకపోవటంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఏ సంతకం అవసరమైనా, ఏ ప్రతిపాదన ఆమోదానికైనా విశ్వవిద్యాలయం సిబ్బంది హైదరాబాద్‌కు వెళ్లి సంతకం తీసుకొస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే చరవాణిలో సంప్రదిస్తూ నిర్ణయం తీసుకుంటున్నాం. శాశ్వత వీసీ త్వరలో వచ్చే అవకాశముంది. **- ఆచార్య వరప్రసాద్, రిజిస్ట్రార్, శాతవాహన విశ్వవిద్యాలయం**

■ విధానపరమైన, అభివృద్ధి పనుల నిర్ణయాలు తీసుకోవటంలో జాప్యం జరుగుతోంది. బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలతోపాటు విద్యార్థి పరిశోధకుల సమస్యలు పరిష్కారం కావటంలేదు.

■ శాశ్వత ఉపకులపతులు ఇదిగో, అదిగో వస్తున్నారని ప్రభుత్వం ఊరడింపు ప్రకటనతో సరిపుచ్చుతోంది. సమస్యల పరిష్కారం జాప్యం చోటు చేసుకుంటుంది.

ఎస్సారెస్పీకి 21 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 21,590 క్యూసెక్కుల వరద వస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మధ్యమానేరుకు తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్ ఉత్పత్తికి 6,800, ఎస్కేప్ గేట్లద్వారా గోదావరిలోకి 1,200, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091 అడుగుల నీటిమట్టం ఉంది.

స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతం

పొలంలో పడి సహాయ లైన్‌మెన్ మృతి



నరేశ్

మానకొండూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభంపై మరమ్మతు చేస్తున్న ఉద్యోగి విద్యుదాఘాతంతో కింద పడి మృతి చెందడం ఆదివారం మానకొండూర్ మండలం కెల్లేడు శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన జోగి నరేశ్(37) మూడున్నరేళ్లుగా కొండపల్కల క్లస్టర్‌లో సహాయ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. కెల్లేడు శివారులోని వరి పొలంలో విద్యుత్తు స్తంభంపై ఇన్సులేషన్ మరమ్మతు కోసం ఆదివారం ఆయన సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకొన్నారు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్తు సరఫరా కావడంతో కింద పడ్డారు. కింద వరి పొలంలో తల బురదలో కూరుకుపోయి ఊపిరి ఆడక మృతి చెందారు. ఘటన జరిగిన సమయంలో నరేశ్ మినహా అక్కడ ఎవరూ లేరు. కింద పడిన వెంటనే బురద నుంచి బయటకు తీస్తే ప్రాణాలు దక్కేవని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, పదేళ్లలోపు కుమారుడు, కూతురున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ జట్టు విజయం

చైతన్యపురి, న్యూస్‌టుడే: వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మధ్య ఆదివారం వరంగల్‌లోని ఫాతిమా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కరీంనగర్ న్యాయవాదుల జట్టు గెలుపొందినట్లు స్పోర్ట్స్ సెక్రటరీ మడిపల్లి రవి తెలిపారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకున్న వరంగల్ జట్టు 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ న్యాయవాదుల జట్టు 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. గెలుపొందిన జట్టు న్యాయవాదులను బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



గెలుపొందిన న్యాయవాదుల జట్టు సభ్యులు

షాట్‌పుట్‌లో అక్కాచెల్లెళ్లు అదుర్స్

న్యూస్‌టుడే, ఓదెల

ఆటలపై ఇష్టంతో అక్క మెలకువలు నేర్చింది.. ఆమె స్ఫూర్తితో చెల్లెలు సాధన మొదలుపెట్టింది.. క్రీడల్లో పతకాలు సాధిస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతున్నారా సోదరీమణులు. ఓదెల మండలం కొలనూరుకు చెందిన రేండ్ల రాజేందర్, శ్రీహర్ష దంపతుల కూతుళ్లు శ్రావ్యశ్రీ, సౌమ్యశ్రీ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు. రాజేందర్ కారు నడుపుతూ, శుభకార్యాలకు వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన ఆయన కూతుళ్ల ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మెలకువలు నేర్పించారు.



చిన్నతనం నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. బడిలో జరిగిన ఆటల పోటీల్లో నా ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు షాట్‌పుట్‌లో ప్రోత్సహించారు. ప్రత్యేక శిక్షణ ఇస్తూ మెలకువలు నేర్పించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇంటికి సమీపంలోనే ఉన్న పాఠశాల మైదానంలో సాధన చేస్తున్నాను. గతేడాది బిహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడాను. అలాగే ఖమ్మం, మెదక్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లలో జరిగిన పోటీల్లో ఆరు మార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల గోదావరిఖని ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 7, 8 తేదీల్లో హనుమకొండలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ముందు అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. **- శ్రావ్యశ్రీ, తొమ్మిదో తరగతి**

ఉదయం సాయంత్రం సాధన



అక్కయ్య స్ఫూర్తితో ఆటలపై ఆసక్తి పెంచుకున్నా. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం పాఠశాల ముగియగానే గంట పాటు వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో సాధన చేస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేలా అమ్మానాన్న మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మేం తీసుకునే ఆహారంలోనూ జాగ్రత్తలు పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో రెండు సార్లు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఆడాను. గతేడాది భద్రాచలంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచా. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ఆడాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నదే లక్ష్యం.

- రేండ్ల సౌమ్యశ్రీ, ఎనిమిదో తరగతి

ఆర్టీసీ బస్సు ఢీకొని

ఒప్పంద కార్మికుడి దుర్మరణం



లక్ష్మయ్య

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒప్పంద కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వేముల లక్ష్మయ్య(58) బసంత్‌నగర్‌కేశోరాం సిమెంట్ పరిశ్రమలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం భార్య మల్లీశ్వరితో కలిసి ద్విచక్రవాహనంపై దేవునిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శనానికి వెళ్తున్నారు. అందుగులపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గాయపడ్డ మల్లీశ్వరిని పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి చెప్పారు.

ఆరుతడికి ఊతమేది!

ఈ నెల నుంచి యాసంగి సీజను ఆరంభం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం



ఆవాల పైరు

దశాబ్దం కిందటి వరకు ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట పత్తి, మక్క, పసుపు తదితర అన్ని పైర్లను దాటుకుని ప్రస్తుతం కేవలం వరివిస్తీర్ణం గణనీయంగా పెరిగి పంటలవైవిధ్యం దెబ్బతింటోంది. ఈ నెల నుంచి యాసంగి మొదలుకానున్న తరుణంలో ప్రభుత్వ ప్రోత్సాహం దీర్ఘకాలికంగా ఆరుతడికి ఊతమివ్వనుంది.

■ ఆరుతడి పంటల సాగుకు కూలీల కొరత, మద్దతు ధరకు సేకరించకపోవటం, మార్కెటింగ్ సమస్య, కోతులు, నెమళ్లు, అడవిపందులు తదితర వన్యప్రాణుల బెడద, విత్తన రాయితీని, ఆరుతడి పైర్లకు ఉపకరించే బిందుసేద్య రాయితీని ఎత్తివేయటంతో పాటు సాగునీటి లభ్యత పెరగటం తదితర కారణాలతో రైతులందరూ వరివైపే మళ్లారు.

■ జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో రాష్ట్రంలోనే వరి, నువ్వులపై అత్యధిక పరిశోధనలు సాగుతున్నాయి. పొలాసలో వేరుసెనగ, పత్తి, కంది, చెరకు తదితర అన్నిరకాల ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపడితే ద్వారా మన ప్రాంత నేలలకు అనువైన అధిక దిగుబడి వంగడాల రూపకల్పన సాధ్యపడుతుంది. ఇటీవల జగిత్యాల జిల్లాలో ఆవాలసాగు గణనీయంగా పెరుగుతున్నందున కేంద్రం ప్రకటించినట్లు పొలాస పరిశోధనస్థానంలో ఐసీఏఆర్ ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పరచాలి.

■ ఐసీఏఆర్ కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంటలో ఉండగా ఇక్కడ పూర్తిస్థాయి పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. సెనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితరాల్లో మేలైన వంగడాలను రూపొందించటం, ఆరుతడి పంటల్లో దిగుబడులు పెరిగి చీడపీడలు, కలుపు నివారణ రసాయనాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెచ్చినట్లయితే నల్లరేగటి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల రైతుల క్రమంగా వీటిసాగును పెంచుతారు. పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

■ పెద్దపల్లి జిల్లా కూనారం వరి పరిశోధనస్థానంలో పలు ఆరుతడి పంటలపై పరిశోధనలను చేపట్టాలి. కరీంనగర్ పరిశోధనస్థానంలో కేవలం మొక్కజొన్న పైనే పరిశోధనలు సాగుతుండగా మన రైతులు పండించే, స్థానిక నేలలకు అనువైన పంటలపై పరిశోధనలను చేపట్టి చేపట్టి తెలంగాణ సీడ్స్ ద్వారా రైతులకు రాయితీపై అన్నిరకాల విత్తనాలను ఇచ్చినట్లయితే రైతులకు ప్రోత్సాహకంగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 2014 - 24 వానాకాలంలో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో...)

పంట	2014	2024
వరి	6,08,321	9,82,687
పత్తి	5,03,402	1,69,013
మక్క	85,739	41,259
కంది	21,547	11,515
నువ్వులు	15,064	29,297
మామిడి	65,373	73,741
పసుపు	42,546	30,430
ఇతర పూలు, పండ్లు, మిరప, కూరగాయలు	22,549	42,562

పంట మార్పిడి పాటించాలి



వరి స్థానంలో మరోపంటగా ఆరుతడిని పండిస్తే పంటల సరళి, నేలస్థితిగతులు మెరుగుపడతాయి. నేలలు, నీటిలభ్యత, కూలీలు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ చూసుకుని రైతులు పంటమార్పిడి పాటించాలి.

- డాక్టర్ జి.శ్రీనివాస్, సహపరిశోధన సంచాలకులు

■ జగిత్యాల చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధస్థానాన్ని ఏర్పాటు చేసినట్లయితే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, ఇతర సీతాఫల్, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూలసాగును చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. జగిత్యాల మామిడి మార్కెట్లో శాశ్వత పండ్ల మార్కెటును ఏర్పాటుచేస్తే రైతులకు ఏడాది పొడవునా విక్రయ అవకాశాలుంటాయి.

■ నాలుగు జిల్లాల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలను పెద్దఎత్తున నాటుతుండగా స్థానికంగా గానుగ పరిశ్రమలను నెలకొల్పాలి. జిల్లాలో యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో రైతులు విత్తనోత్పత్తి చేపడుతున్నందున విత్తనోత్పత్తి పైర్లసాగును పెంచేలా ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసేలా చూడాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని అందుబాటులోకి తేవాలి.

■ ప్రభుత్వం హామీఇచ్చినట్లు ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. వెల్గటూరు, మల్లాపూర్ మండలాల్లో తలపెట్టిన ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేస్తే రైతులకు విక్రయ అవకాశాలు దరిచేరి ఆరుతడి పంటలకు మళ్లుతారు. నిజామాబాద్‌లోని పడిగెల్ వద్ద తలపెట్టిన స్పైసెస్ పార్కును పూర్తిచేస్తే ఉద్యాన పంటల రైతులకు ధీమాగా ఉంటుంది.

■ పొలాస పరిశోధన స్థానంలోని ఇంక్యూబేషన్ సెంటర్ ద్వారా యువరైతుల ఆవిష్కరణలను ప్రోత్సహించాలి, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి యూనిట్లను, చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పేలా రాయితీలనివ్వాలి. పాలీహౌజులు, ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, యంత్రపరికరాల రాయితీని పునరుద్ధరించాలి. పంటలబీమాను యాసంగి నుంచి అమలుచేయాలి. విపణిలో ధరతగ్గిన ఉత్పత్తులను మార్కెట్‌జోక్య పథకం ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేస్తే ఆరుతడికి క్రమంగా దన్ను కలుగుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, వీర్నపల్లి

? వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు చాలా ఇబ్బందులు అయ్యాయి. ప్రస్తుతం బతుకమ్మ పండగ నేపథ్యంలో విద్యుత్తు దీపాలు మరమ్మతులు చేయాలి. **- తాటు అజయ్, వీర్నపల్లి యువకుడు**

✓ హైమాస్ట్ విద్యుత్తు దీపాలను ఆదివారం ఏర్పాటు చేశాం. **- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి వీర్నపల్లి**

న్యూస్‌టుడే, రుద్రంగి

? రుద్రంగి మండల కేంద్రం నుంచి దసరానాయక్ తండాకు వెళ్లే మార్గంలో వాగుపై వంతెన ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- గణేశ్, రుద్రంగి**

✓ దసరానాయక్ తండాకు వెళ్లే మార్గంలో ధ్వంసమైన వంతెన తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5 లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేస్తాం. **- మనోహర్, పీఆర్ ఏఈ, రుద్రంగి**

న్యూస్‌టుడే, బోయినపల్లి

? దేశాయిపల్లి నుంచి రామన్నపేట మీదుగా వేములవాడ వెళ్లే దారి గుంతలుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. **- రాము, రత్నంపేట**

✓ ప్రమాదకరంగా ఉన్న గుంతల వద్ద మరమ్మతులు చేపడుతున్నాం. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. **- విష్ణువర్ధన్, పీఆర్ ఏఈ**

ప్రయాణ ప్రాంగణం లేక ఇక్కట్లు



రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ ప్రధాన చౌరస్తాలో ప్రయాణ ప్రాంగణం లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడి చౌరస్తాలో ప్రయాణ ప్రాంగణం నిర్మించారు. జాతీయ రోడ్డు విస్తరణలో దీనిని కూల్చివేశారు. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఆసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి మళ్లీ నిర్మించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంగి**

ఇదేనా స్వచ్ఛత?

మండల కేంద్రంలోని 11వ వార్డులో మురుగు కాలువ పక్కన గడ్డి బాగా పెరిగింది. దీంతో కాలువ ఉన్న ఆనవాళ్లు కనిపించడం లేదు. అందులో మురుగు తీసి దాదాపు 50 రోజులవుతుందని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేపట్టడం లేదు. దీంతో అధ్వానంగా మారింది. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గంభీరావుపేట



మిషన్ భగీరథ నీరు వృథా



సిరిసిల్ల- వెంకటాపూర్ రెండో బాహ్యవలయ ప్రధాన రహదారిలో అపరెల్ పార్కు ఎదుట మిషన్ భగీరథ నీరు గత కొద్ది నెలలుగా వృథాగా పోతుంది. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. నీరు కలుషితమై కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. పైగా రాత్రి సమయంలో ఆ గుంత కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్



ఎల్లారెడ్డిపేట: ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, గురువులు



ముస్తాబాద్‌లో...

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 15 సంవత్సరాల తరవాత ఒకే వేదికపై కలుసుకున్న వీరంతా ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. చదువు నేర్పిన గురువులు నర్సయ్య, దేవదాస్, నాగేంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, ప్రభాకర్, రవీందర్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కోసం తమవంతుగా రూ. 30 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో 2000-2001 ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకే వేదికపై కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువు నేర్పిన గురువులను శాలువాతో సత్కరించారు. సహపంక్తి భోజనం చేశారు. ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రవీందర్, వర్ధకొండ చంద్రం, ఆనందరావు, అశోక్, పూర్వ విద్యార్థులు తుమ్మ రాజేందర్, మెంగని మనోహర్, మల్లారపు సంతోష్‌రెడ్డి, పల్లె సత్యంగౌడ్, కవిత, వకుల, సంగీత, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లిలో కేకు కోస్తూ...

బోయినపల్లి: బోయినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. కేక్ కోసి వేడుకలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిని సన్మానించారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం

రాచర్ల బొప్పాపూర్(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శ్రీకృష్ణయాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మానుక రవీందర్, ఉపాధ్యక్షుడిగా బుర్ర వేణి కృష్ణ, కోశాధికారిగా లంబ శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారంతోపాటు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు రవీందర్

క్రికెట్ అసోసియేషన్...

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లిలో ఆదివారం మండల క్రికెట్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బలరాం, ఉపాధ్యక్షులుగా రవి, శంకర్, సతీశ్, ప్రధాన కార్యదర్శిగా చందు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా రాకేష్, నరేష్, కోశాధికారిగా రాజేందర్, సలహాదారులుగా చాంద్‌పాషా, లింబాద్రి, గణేశ్, అజ్జునాయక్, కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, జగన్ వ్యవహరించనున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండల కేంద్రంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుకు ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి నీరు నిల్వ అవుతుంది. ఫలితంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులపై సెప్టెంబర్ 30న 'నీరు కదలదు... దోమ వదలదు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమయింది. దీనికి పంచాయతీ కార్యదర్శి తిరుపతి స్పందించారు. సిబ్బందితో ట్యాంకు ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకున్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



నర్సింహులపల్లెలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామంలోని మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో కాలిపోయిన బోరును మరమ్మతు చేయించాలని అధికారులను కోరగా, బోరు పని చేయకుంటే మిషన్ భగీరథ నీరు తాగాలని చెబుతున్నారని వాపోయారు. మిషన్ భగీరథ నీరు తాగడానికి వీలుగా లేదని చెప్పినా అధికారులు వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పూర్మాని మంజుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, బోరు, మోటారు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య తీరిందని గ్రామస్థులు తెలిపారు.

పోరాటాల ఫలితంగానే నూలు డిపో మంజూరు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల నేతన్నల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం నూలు డిపో మంజూరు చేసిందని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడలో కాకుండా పవర్‌లూం పరిశ్రమ కేంద్రంగా ఉన్న సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పనలో భాగంగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, సురేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



గంభీరావుపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పోత్గల్‌లో...

గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు

ముస్తాబాద్, గంభీరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఐదో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ఇళ్ల నుంచి బతుకమ్మలతో బయలుదేరి ప్రధాన కూడళ్లకు చేరుకొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అనంతరం సమీపంలోని జలవనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, యువతులు, తదితరులు పాల్గొన్నారు.

గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా లక్ష్మణ్

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకమైనట్లు ఆదివారం తెలిపారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

వాలీబాల్ పోటీల విజేత మామిడిపల్లి



విజేతలతో మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు

మామిడిపల్లి (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో మెగా యూత్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పోటీల్లో మామిడిపల్లి ప్రథమం స్థానంలో నిలవగా రూ.10 వేల నగదు అందించారు. సుద్దాల ద్వితీయ స్థానంలో నిలవగా రూ.5 వేల నగదు బహుమతి ఇచ్చారు. మాజీ సర్పంచి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచి రాంరెడ్డి, గ్రామస్థులు విజేతలను అభినందించారు. భవిష్యత్తులో మరింత రాణించి గ్రామానికి పేరు తీసుకురావాలని కోరారు.



నారాయణపూర్: కుంకుమ పూజల్లో మహిళలు



సిరిసిల్ల: గాంధీనగర్‌లో అన్నదానం



సుద్దాలలో...

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



కోనరావుపేటలో...

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుంచి మంగళహారతులతో మండపాలకు చేరుకొని కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం



ముస్తాబాద్‌లో...

ఏఎంసీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం అడవిపదిర, మద్దిమల్లలో ఏఎంసీ పాలకవర్గ సభ్యులను ఆదివారం రైతులు సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నరహరి, రైతులు భాస్కర్, రాజు, అంజిరెడ్డి, శ్రీనివాస్, లచ్చయ్య, ప్రశాంత్, రఫీ, జలందర్, విష్ణు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు

రాయితీ విడుదలకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు బతుకమ్మ చీరలకు సంబంధించి రావాల్సిన 10 శాతం నూలు రాయితీని వెంటనే విడుదల చేయాలని లాల్ బావుటా చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూలు డిపో మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల సిరిసిల్ల నేతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు రావాల్సిన రాయితీ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అజ్జ వేణు, దూస రమేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలి పరిస్థితిపై ఆరా

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన కుమ్మరి గంగనర్సవ్వ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివరాలు సేకరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆదివారం తహసీల్దార్ మారుతిరెడ్డి బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి చిరంజీవి, ఏఎన్ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. వేములవాడ గ్రామీణ మండలం చెక్కపల్లిలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సామాజిక న్యాయం, దేశ సమగ్ర భాజపాతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసేందుకు నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు. భాజపాకు యువత నుంచి స్పందన బాగుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు సభ్యత్వ నమోదు పునాదిలా పని చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ప్రయత్నించాలని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.



భాజపా సభ్యత్వం అందజేస్తున్న వికాస్‌రావు, దీప తదితరులు

కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు చెన్నమనేని దీప, మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, మాజీ ఎంపీపీ బండ మల్లేశం, ప్రధాన కార్యదర్శులు రవీందర్, పరమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, బుర్ర శేఖర్, జింక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బరిగెలగూడెం కాలనీలో రూ. 5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హమీద్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎడబోయిన ప్రభాకర్, కోటలింగం, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మూల రాంచంద్రరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పర్శరాములు, అక్కపెల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్కపేట (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన భారాస నాయకుడు ఉత్తెం శ్రీనివాస్ తల్లి నర్సవ్వ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని భారాస సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. భారాస నాయకులు జవ్వాజి అంజయ్య, ఆరె మహేందర్, జవ్వాజి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్ద ...



రుద్రంగిలో...

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్లారెడ్డిపేటలో...

వేములవాడలో నూలు డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నూలు డిపో ఏర్పాటుతో 40 వేల మరమగ్గాల కార్మికులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.



నందికమాన్ వద్ద...

- న్యూస్‌టుడే బృందం

పది తులాల బంగారు ఆభరణాలు మాయం

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో సిరిసిల్ల నుంచి కరీంనగర్ వచ్చే క్రమంలో ఓ ప్రయాణికురాలి సంచిలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలానికి చెందిన బి.త్రివేణి భర్త సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. వారు అక్కడే నివాసముంటున్నారు. దసరా సెలవుల్లో త్రివేణి ఆదివారం ఉదయం కోనరావుపేట నుంచి సిరిసిల్ల బస్టాండ్‌కు వచ్చింది. అక్కడి నుంచి బస్సులో మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుంది. తన బ్యాగు తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒకటో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

నేర వార్తలు

ఇసుక వాహనం బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ వాహనం శనివారం రాత్రి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన డ్రైవర్ పల్లె శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కథనం మేరకు వివరాలు... పదిర సమీప వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాలీ వాహనంలో ఇసుకను కామారెడ్డికి రవాణా చేస్తున్నాడు. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను తప్పించుకునేందుకు రాగట్లపల్లి- నారాయణపూర్ బైపాస్ రహదారిపై వాహన వేగాన్ని పెంచాడు. టైరు పగిలిపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

వానరాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి...

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ద్విచక్ర వాహనం వానరాన్ని ఢీకొన్న సంఘటనలో అదే గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అహ్మద్ రెండు పడక గదుల ఇళ్ల సముదాయం నుంచి రాచర్ల గొల్లపల్లి బస్టాండు వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కోతులు ఒక్కసారిగా అడ్డు వచ్చాయి. అందులోని ఓ కోతిని ఢీకొన్న అహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు.